క్లుప్తంగా

సీఎంతో సోషల్ మీడియా కోఆర్డినేటర్



సీఎంను కలిసిన ప్రశాంత్‌గౌడ్

బొంరాస్‌పేట: సీఎం రేవంత్‌రెడ్డిని కాంగ్రెస్ సోషల్ మీడియా మండల కోఆర్డినేటర్ ప్రశాంత్‌గౌడ్ మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై మాట్లాడారు. నియోజక వర్గ పార్టీ ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శేరి రాజేశ్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ మండల ఇన్‌చార్జ్ గంగిశెట్టి విజయ్‌కుమార్‌ల సమక్షంలో సీఎంను కలిశారు. అనంతరం సీఎం ప్రశాంత్‌గౌడ్‌ను అభినందించారు.

పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

ఏఎంసీ చైర్మన్ ఆంజనేయులు



సీఎం సహాయనిధి చెక్కు అందజేస్తున్న ఆంజనేయులు

కుల్కచర్ల: పేద ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఏఎంసీ చైర్మన్ ఆంజనేయులు పేర్కొన్నారు. కుల్కచర్ల మండలం అల్లాపూర్‌కు చెందిన లచ్చిరాం నాయక్ అనారోగ్య సమస్యతో ప్రవేట్‌ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ రూ.14,500ల చెక్కును మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ..పార్టీలకు, కులమతాలకు అతీతంగా పేదలకు తోడుగా నిలుస్తున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్సేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రభూపాల్ రావు, కృష్ణయ్య, గోపాల్, నందు, అంబాదాస్, తదితరులు పాల్గొన్నారు.

లగచర్లలో ఘనంగా పోచమ్మ బోనాలు



ప్రధాన వీధుల మీదుగా బోనాలతో ర్యాలీగా వస్తున్న మహిళలు

దుద్యాల్: లగచర్ల గ్రామంలో మంగళవారం పోచమ్మ బోనాలు అంగరంగవైభవంగా నిర్వహించారు. నెత్తిన బోనాలతో మహిళలు ప్రధాన వీధుల గుండా ఊరేగింపుగా వెళ్తూ అమ్మవారి పాటలు పాడుకుంటూ ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. అనంతరం అమ్మవారికి బోనం, కోడి పుంజులతో మొక్కులు చెల్లించుకున్నారు. ఈ వేడుకలకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆవుటి శేఖర్, గ్రామ అధ్యక్షుడు లక్ష్మయ్య, కాంగ్రెస్ యూత్ నాయకుడు రామాంజనేయులు, గ్రామ ప్రముఖులు రవీందర్ రెడ్డి, అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ ఏర్పాటుతో కరెంటు వెతలకు చెక్

యాలాల: తమ గ్రామంలో కొత్తగా సబ్‌స్టేషన్ మంజూరు కావడంతో కరెంటు సమస్యలకు ఇక చెక్ పడే అవకాశం ఉందని గ్రామ మాజీ సర్పంచ్ ఒంగోనిబాయి శ్రీనివాస్ పేర్కొన్నారు. గ్రామానికి సబ్‌స్టేషన్ మంజూరు చేయడం పట్ల మంగళవారం గ్రామస్తులతో కలిసి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని పూలమాల, శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బిచ్చప్ప, గ్రామస్తులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సేవలు విలువైనవి

పూడూరు: పంచాయతీ కార్మికుల సేవలు ఎంతో విలువైనవని డీసీసీ కార్యదర్శి శకీల్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని అంగడిచిట్టంపల్లి గ్రామ పంచాయతీలోని కార్మికులకు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీలో సేవ చేయడం ఎంతో అదృష్టంగా భావించాలని పేర్కొన్నారు. అనంతరం కార్మికులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగయ్య, నాయకులు చెన్నయ్యగౌడ్, రవి, క్రిష్ణ, యేసోబు, తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

అనంతగిరి: వికలాంగులకు, వృద్ధుల, వితంతువుల పెన్షన్‌ను పెంచాలని కోరుతూ కొడంగల్‌లో వచ్చే నెల 1న నిర్వహించనున్న సభను విజయవంతం చేయాలని జిల్లా ఇన్‌చార్జి రామకృష్ణ తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మందకృష్ణ మాదిగ విచ్చేయనున్నారని ఆయన పేర్కొన్నారు.

అడుగు తీసి అడుగు వెయ్యలేం!

- అస్తవ్యస్తంగా సిద్దులూర్ -అక్నాపూర్ రోడ్డు
- ఏళ్లు గడుస్తున్నా వీడని గ్రహణం
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

నవాబుపేట: అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అక్నాపూర్ గ్రామం నుంచి వికారాబాద్ మండలం సిద్దులూర్ వరకు నాలుగు కిలోమీటర్ల మేర ఉంటుంది. కానీ ఈ రెండు గ్రామాల ప్రజల రాకపోకల కోసం నేటి వరకు బీటీ రోడ్డుకు నోచుకోలేదు. ఎప్పుడో 15 ఏళ్ల క్రితం ఉపాధిహామీ కింద ఫార్మేషన్ రోడ్డు వేయించారు. దానిపైనే రెండు గ్రామాల ప్రజలు రకాపోకలు సాగిస్తున్నారు.

ఆరు నెలలు అంతే..

వర్షాకాలం మొదలు దాదాపు ఆరు నెలలు ఈ రోడ్డుపై నడవాలంటే నరకయాతన తప్పదు. కాస్త వర్షం కురిస్తే బురదమయంగా మారుతుంది. అక్కడ దాదాపు 5 వరకు చిన్న వాగులు ఉన్నాయి. వర్షాకాలం మొత్తం అవి పారుతుంటాయి. ఆ వాగులపై కల్వర్టులు లేకపోవడంతో నీళ్లల్లో నుంచే రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి. గతంలో రెండు కిలోమీటర్ల వరకు ఫార్మేషన్ రోడ్డుపై కంకర వేసి చేతులు దులుపుకున్నారు. మరమ్మతులు చేసి చాలా కాలం కావడంతో వర్షాలకు వేసిన కంకర కూడా కొట్టుకపోయింది. మిగిలిన రెండు కిలోమీటర్ల రోడ్డు దయనీయంగా మారింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఇక్కడ నడవలేని దుస్థితి నెలకొందని రెండు గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత్యంతరం లేకే ఈ రెండు గ్రామాల ప్రజలు చించల్‌పేట గ్రామం మీదుగా అదనంగా 12 కిలోమీటర్లు తిరిగి రాకపోకలు సాగిస్తున్నారు. అయినా అధికారులు గానీ, స్థానిక ప్రజాప్రతినిధులకు కనికరం ఉండడం లేదు.



బురదమయంగా మారిన రోడ్డు

చర్యలు తీసుకోవాలి



సిద్దులూర్ నుంచి అక్నాపూర్ వెళ్లే దారి ప్రస్తుతం దారుణంగా మారింది. అడుగు తీసి అడుగు వెయ్యలేనట్లుగా ఉంటుంది. ఈ వర్షాకాలం మొత్తం ఇలాగే ఉంటుంది. ఇంత ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఈ విషయంలో ఎవరు పట్టించుకోవడం లేదు. ప్రజల కష్టాలు ప్రజాప్రతినిధులకు కనిపించవా? ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– పరమేశ్వర్, సిద్దులూర్

నారుమడులను తలపిస్తోంది



అక్నాపూర్ నుంచి సిద్దులూర్ వెళ్లే నాలుగు కిలోమీటర్ల రోడ్డు వర్షాకాలం పూర్తిగా ముగిసే వరకు బురదమయంగానే ఉంటుంది. ఎండ కాస్తేనే ఎండి పోతుంది. వర్షం పడితే నారుమడులను తలపిస్తుంది. చాలా కాలంగా ఈ సమస్య ఉన్నా తమకేమి సంబంధం లేనట్లు వ్యవహరిస్తున్నారు. ఎమ్మెల్యే చొరవ తీసుకొని బీటీ రోడ్డు మంజూరు చేయించాలి.

– శ్రీనివాస్‌గౌడ్, అక్నాపూర్

ఉన్నతాధికారులకు నివేదిస్తా

అక్నాపూర్ నుంచి సిద్దులూర్ వరకు ఉన్న రోడ్డు గతంలో కొంత మేరకే మెటల్ వేశారు. మిగతా అంత ఫార్మేషన్ రోడ్డు ఉంది. వర్షా కాలంలో బురదగా మారుతుంది. బీటీ రోడ్డు నిర్మాణానికి ఉన్నతాధికారులకు నివేదిస్తా. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, స్పీకర్ ప్రసాద్ కుమార్ ఇద్దరిలో ఎవరు నిధులు మంజూరు చేయించిన రోడ్డు వేయిస్తాం.

– ఏఈ(పీఆర్) ప్రణీత్, నవాబుపేట

బనకచర్ల ద్రోహాన్ని బయటపెడదాం

- జలదోపిడీని అరికడదాం
- టీఆర్ఎస్వీ నాయకులు



బనకచర్ల ప్రాజెక్టుతో కలిగే నష్టాలపై విద్యార్థులతో చర్చిస్తున్న టీఆర్ఎస్వీ నాయకులు

తాండూరు టౌన్: గోదావరి నదిపై బనకచర్ల వద్ద ప్రాజెక్టు నిర్మించి తెలంగాణాకు ద్రోహం చేద్దామనుకుంటున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తున్నట్లు బీఆర్ఎస్ విద్యార్థి విభాగం జిల్లా కోఆర్డినేటర్ కోట్ల మహిపాల్, జిల్లా అధికార ప్రతినిధి దత్తాత్రేయ రావు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని శాలివాహన డిగ్రీ కళాశాల విద్యార్థులతో జరిగిన చర్చలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోదావరి, కృష్ణా నదుల యాజమాన్య బోర్డు, కేంద్ర జలవనరుల సంఘం అనుమతులు లేకుండా బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపడతామని ఏపీ ప్రభుత్వం చెప్పడం సరికాదన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టాన్ని తుంగలో తొక్కుతూ ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ప్రాజెక్టు నిర్మాణానికి సన్నాహాలు చేస్తుండటాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుల మధ్య లోపాయకారి ఒప్పందాలు కుదుర్చుకోవడం సిగ్గు చేటన్నారు. తెలంగాణ రైతాంగానికి, ప్రజలకు తీవ్ర నష్టం కలుగజేసే ఈ ప్రాజెక్టును విద్యార్థి లోకం, యువత తీవ్రంగా ఖండించాలన్నారు. గోదావరి నీటి హక్కుల కోసం మరో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్వీ నియోజక వర్గ అధ్యక్షుడు జోగుల ఎబినేజర్, పట్టణాధ్యక్షుడు సందీప్ రెడ్డి, భాను తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈఓ

మండల విద్యాధికారి గోపాల్

పరిగి: విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మండల విద్యాధికారి గోపాల్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని మల్కాపూర్, రంగాపూర్ పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పాఠశాలకు ఉపాధ్యాయులు ఆలస్యంగా వస్తే సెలవుగా గుర్తిస్తామన్నారు. ప్రతిఒక్కరూ సమయపాలన పాటించాలని తెలిపారు. ఎఫ్ఎల్ఎన్ మూల్యాంకనాన్ని పరిగణంలోకి తీసుకుని విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు ప్రతీరోజు మెరుగైన విద్యాబోధన చెయ్యాలన్నారు. షెడ్యూల్ ప్రకారం పాఠాలను చెప్పాలన్నారు. పాఠశాలలో తప్పకుండా మూమెంట్ రిజిష్టర్స్, విద్యార్థుల ప్రగతి నమోదు రికార్డులను తప్పకుండా నిర్వహించాలన్నారు. అనంతరం భవిత కేంద్రాన్ని పరిశీలించారు. ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి బుధవారం భవిత కేంద్రంలో ఫిజియోథెరపి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పేదల పెళ్లిళ్లకు ఆర్థిక సహకారం

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శేరి రాజేశ్‌రెడ్డి
- కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న తహసీల్దారు, రాజేశ్‌రెడ్డి

బొంరాస్‌పేట: పేదింటి ఆడబిడ్డల పెళ్లిల్లు తల్లిదండ్రులకు భారం కాకూడని ప్రభుత్వం ఆర్థిక సహకారం అందజేస్తుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శేరి రాజేశ్‌రెడ్డి పేర్కొన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పేదలు సద్వినియోగించుకోవాలన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ మందిరంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అనంతరం ఆయా గ్రామాలకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు 21 మందికి చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు పద్మావతి, మండల అధ్యక్షుడు నర్సింలుగౌడ్, వెంకట్రాములుగౌడ్, రాంచంద్రారెడ్డి, మల్లేశం, నర్సింలునాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాస్నం పాఠశాలకు టీచర్లను నియమించండి

యాలాల: మండలంలోని రాస్నం ఉన్నత పాఠశాలకు ఇంగ్లీషు, సోషల్ టీచర్లు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహిస్తున్న వారిలో ఒకరు ఉద్యోగ విరమణ చేయడం, మరొకరికి జూనియర్ లెక్చరర్ ఉద్యోగం రావడంతో ఖాళీలు ఏర్పడ్డాయి. ఈ విషయంలో విద్యాశాఖ ఉన్నతాధికారులు, స్థానిక ఎమ్మెల్యే దృష్టిసారించి పాఠశాలకు ఉపాధ్యాయులను నియమించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాల వర్తింపు

పూడూరు: కాంగ్రెస్ పాలనలో అర్హులందరికీ ప్రభుత్వ పథకాలను అందిస్తున్నామని సీనియర్ నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని పెద్ద ఉమ్మెంతాల్‌లో ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్‌లను, రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఒక్క రేషన్‌కార్డు, ఒక్క ఇల్లు ఇవ్వలేదని విమర్శించారు.

పరిశుభ్రత పాటించాలి

కుల్కచర్ల: ప్రతీఒక్కరు పరిశుభ్రత పాటించాలని కుల్కచర్ల మండల వైద్యాధికారి కిరణ్ గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం బండవెల్కిచర్ల గ్రామ పరిధిలోని బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..విద్యార్థినులు వ్యక్తిగత ఆరోగ్యంపై దృష్టి సారించాలని, స్వచ్ఛతను పాటిస్తూ ఆరోగ్యకరమైన అలవాట్లను చేసుకోవాలన్నారు. ఉదయం లేచి వ్యాయామం, యోగా వంటివి చేయాలన్నారు. ఏదైనా అనారోగ్య సమస్య ఉంటే స్థానిక ఉపాధ్యాయ సిబ్బంది ద్వారా తమకు సమాచారం అందిస్తే వైద్య సిబ్బందిని పాఠశాలకు పంపించి వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ పాఠశాల ప్రత్యేకాధికారి బాలవరలక్ష్మి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

కంటి చూపుతోనే మెరుగైన జీవితం

- పేదలకు సేవ చేయడం అదృష్టం
- లయన్స్ క్లబ్ సభ్యులు



కంటి పరీక్ష చేస్తున్న లయన్ హరినాథ్

కొడంగల్: పేదలకు సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు కొడంగల్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మురహరి వశిష్ట, పట్టణ మాజీ సర్పంచు, లయన్స్ క్లబ్ కోశాధికారి వెంకట్‌రెడ్డి దేశ్‌ముఖ్ పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, వైద్య ఆరోగ్య శాఖ, లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో ఆప్తాల్మిక్ అధికారి లయన్ హరినాథ్ వైద్య పరీక్షలు చేశారు. 30 మందికి పైగా కంటి పరీక్షలు చేయించుకున్నారు. అందులో 18 మందిని ఆపరేషన్ల కోసం ఎంపిక చేశారు. వారిని మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని రాంరెడ్డి కంటి వైద్యశాలలో ఆపరేషన్లు చేయించడానికి ప్రత్యేక వాహనంలో పంపించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ సభ్యులు మాట్లాడుతూ ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తున్నట్లు తెలిపారు. సమాజంలో ప్రతిఒక్కరూ సేవా భావంతో మెలగాలన్నారు. కంటి చూపుతోనే మెరుగైన జీవితం సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ కార్యదర్శి భీంరాజు, సీనియర్ సభ్యులు దాసప్ప యాదవ్, శ్రీనివాస్ గౌడ్, మిఠాయి రాజు, దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

అనంతగిరి: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంఐఎం వికారాబాద్ పట్టణ అధ్యక్షుడు ఉస్మాన్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలోని 23వ వార్డులో ఉచిత మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 248మంది పరీక్షలు చేయించుకున్నారు. వైద్యులు అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహ్మద్ షరీఫ్, ఇమ్రాన్, జలీల్, షైబాజ్, బిలాల్, రఫీ, అబ్బాస్ అలీ, మహ్మద్ సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కేరళ మాజీ సీఎంకు నివాళి



తాండూరు టౌన్: చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం, ప్రజాసంఘాల నాయకులు

తాండూరు టౌన్: కేరళ మాజీ సీఎం అచ్యుతానందన్ మృతి పట్ల సీపీఎం నాయకులు మంగళవారం స్థానిక అంబేడ్కర్ చౌక్‌లో నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గ సభ్యుడు కె శ్రీనివాస్ మాట్లాడుతూ కేరళలోని ట్రావెన్‌కోర్ సంస్థానంలో భూస్వాములపై పోరాడి జైలు జీవితం గడిపిన మహనీయుడు అచ్యుతానందన్ అని కొనియాడారు. సీపీఎం వ్యవస్థాపక సభ్యుల్లో ఆయన ఒకరన్నారు. ఏడుసార్లు ఎమ్మెల్యేగా, 15 ఏళ్ల పాటు ప్రతిపక్ష నేతగా ఆయన వ్యవహరించారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ హక్కుల పోరాట సంఘం జిల్లా అధ్యక్షుడు కె చంద్రయ్య, సీఐటీయూ, ప్రజాసంఘాల నాయకులు కృష్ణ, రవి, బాలప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆశయ సాధనకు కృషి

అనంతగిరి: కమ్యూనిస్టు యోధుడు, కేరళ మాజీ సీఎం కామ్రేడ్ అచ్యుతానందన్ మరణం పార్టీకి తీరని లోటని సీపీఎం జిల్లా కార్యదర్శి మహిపాల్ పేర్కొన్నారు. వికారాబాద్‌లోని సీపీఎం జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం మహిపాల్ మాట్లాడుతూ నిరంతరం పార్టీ అభ్యున్నతికి పాటుపడ్డారన్నారు. రామకృష్ణ, లక్ష్మయ్య, యాదయ్య, జంగయ్య, దశరథ్, శ్రీనివాస్, తిరుమలయ్య, కిషన్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ప్రణాళిక



పీఆర్టీయూ సభ్యత్వ నమోదు చేయిస్తున్న సంఘం నాయకులు

పీఆర్టీయూ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

యాలాల: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి ప్రణాళికతో ముందుకు వెళ్తామని పీఆర్టీయూ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు క్రిష్టారెడ్డి, రాములు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని జుంటుపల్లిలో 2025–26 ఏడాదికిగాను పీఆర్టీయూ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎంఈఓ రమేశ్ మాట్లాడుతూ..ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి, విద్యాభివృద్ధికి పాటుపడుతున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు, జీపీఎఫ్ పార్ట్ ఫైనల్, మెడికల్ రీయింబర్స్‌మెంట్, ఈఎల్ సరెండర్, సర్వీస్ బుక్ అప్‌డేట్ లాంటి అంశాలపై చర్చించి, జిల్లా, రాష్ట్ర శాఖల బాధ్యులకు వివరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పటేల్ మహేష్‌కుమార్, వెంకట్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, లక్ష్మయ్య, శ్రీధర్‌రెడ్డి, జిల్లా సభ్యులు అశనప్ప, ప్రభాకర్ చారి, రవీంద్రనాథ్, చంద్రశేఖర్, మండల సభ్యులు వెంకటయ్య, రవిజోషి, రవీందర్, రమాకాంత్, రాజేష్ పాల్గొన్నారు.

తాండూరు రూరల్‌లో..



తాండూరు రూరల్: చెంగోల్ ఉన్నత పాఠశాలలో సభ్యత్వ నమోదులో అధ్యక్షుడు చంద్రశేఖర్

తాండూరు రూరల్: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు కడియాల చంద్రశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం అంతారం, చెంగోల్, కరన్‌కోట్, సిరిగిరిపేట్, గౌతపూర్, చంద్రవంచ పాఠశాలల్లో పీఆర్టీయూ సభ్యత్వ నమోదును బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు ఎన్నో రాయితీలను, మెరుగైన సౌకర్యాలను కల్పించిన ఘనత పీఆర్టీయూ సంఘానికే దక్కుతుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంపాదకవర్గ సభ్యుడు బాకారం జైపాల్‌రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు అంబమ్మ, మండల అధ్యక్ష, కార్యదర్శులు జొన్నల వినోద్, పురుషోత్తంరెడ్డి, నాయకులు వీరేశంగౌడ్, బాబ్యనాయక్, మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హరిత తెలంగాణే లక్ష్యం



గొట్లచెల్కతండాలో మొక్క నాటుతున్న విజయ్‌కుమార్‌రెడ్డి

కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి

దోమ: హరిత తెలంగాణే లక్ష్యమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాలి విజయ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం గొట్లచెల్కతండా గ్రామ పంచాయతీలో వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వం పకడ్బందీగా వన మహోత్సం నిర్వహిస్తుందని, ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ యాదవరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ శాంతకుమార్, మాజీ వైస్ ఎంపీపీ బంగ్ల యాదయ్యగౌడ్, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి రమేశ్‌గౌడ్, నాయకులు చందు, తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎంపిక

దిర్సంపల్లి గ్రామంలో నూతన గ్రామ కమిటీని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మాలి విజయ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా పాత్లావత్ లక్ష్మణ్‌నాయక్, ఉపాధ్యక్షుడిగా నేనావత్ హరి, ప్రధానకార్యదర్శిగా రుక్కీబాయ్, కోశాధికారిగా గంగ్యా, సోషల్ మీడియా కన్వీనర్‌గా గణేశ్, కార్యదర్శిగా నేనావత్ రూప్లాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల కోలాహలం

- రిజర్వేషన్ స్థానాలపై చర్చ
- ప్రభుత్వ నిర్ణయంపై ఆశావహుల ఆసక్తి



మండల పరిషత్ కార్యాలయం

మోమిన్‌పేట: రాష్ట్ర ప్రభుత్వం స్థానిక ఎన్నికలను నిర్వహించనున్నట్లు ప్రకటించడంతో గ్రామాల్లో ఆశావహుల ఆసక్తి పెరిగింది. ముందుగా జిల్లా పరిషత్, మండల పరిషత్ ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన సీట్లను ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్రంలో జిల్లా పరిషత్ చైర్మన్‌లు, జిల్లాలో ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీల సంఖ్యను విడుదల చేయడంతో అన్ని పార్టీల నాయకులు పావులు కదుపుతున్నారు. మండలంలో ఒక జెడ్పీటీసీ, 12 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. ప్రభుత్వం ఇప్పటికే రిజర్వేషన్లను రొటేషన్ పద్ధతిపై మార్పు చేయనున్నట్లు ప్రకటించింది. దీంతో గతంలో ఉన్న రిజర్వేషన్ ప్రస్తుతం కొనసాగవు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పంచాయతీ రాజ్ చట్టం 2018 ప్రకారం రెండు విడతలు ఒకే రిజర్వేషన్ ఉండేలా చట్టం తెచ్చింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టాక ఆ చట్టానికి సవరణ చేసింది. రొటేషన్ పద్ధతిలో ఒకే విడత రిజర్వేషన్ ఉండేలా చర్యలు తీసుకున్నారు. మోమిన్‌పేటలోని 12 ఎంపీటీసీ సభ్యులకు గతంలో జనరల్-6, ఎస్సీ-3, ఎస్టీ-1, బీసీ-2లకు రిజర్వు అయ్యాయి. చీమల్‌దరి, టేకులపల్లి, ఏన్కతల, మొరంగపల్లి, మేకవనంపల్లి, రాంనాథ్‌గుడుపల్లి స్థానాలకు జనరల్, మోమిన్‌పేట ఒకటి, కోల్కుంద స్థానాలు బీసీలకు రిజర్వు చేశారు. మోమిన్‌పేట రెండు, మూడు, వెల్‌చాల్ ఎస్సీలకు రిజర్వు చేశారు. ఎన్కేపల్లి స్థానాన్ని ఎస్టీకి రిజర్వు చేశారు. ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాలను ఎస్సీలకు రిజర్వు చేశారు. ఈ క్రమంలో ప్రస్తుతం గత రిజర్వేషన్లు ఉండవు. కాబట్టి తప్పనిసరిగా రిజర్వేషన్లలో మార్పు ఉంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఆ దిశగా ఆయా పార్టీల నాయకులు కూడా పావులు కదుపుతున్నారు. రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని ప్రకటించడంతో రిజర్వేషన్లపై ప్రభావం చూపనుందని పలువురు చర్చించుకొంటున్నారు. ఏఏ స్థానాలు బీసీలకు రిజర్వు కానున్నాయనే అంచనాలు వేస్తూ ఆయా పార్టీల నాయకులు అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేస్తున్నారు.